క్లుప్తంగా

బస్టాండ్లలో తనిఖీలు



తనిఖీ చేపడుతున్న అధికారులు

ఖమ్మంమయూరిసెంటర్: నగరంలోని కొత్త, పాత బస్టాండ్లను గురువారం కరీంనగర్ జోన్ విజిలెన్స్ అండ్ సెక్యూరిటీ ఆఫీసర్ రవీందర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా బస్టాండ్లలో ఏర్పాటు చేసిన స్టాళ్లలో విక్రయాలను పరిశీలించి ఎమ్మార్పీ ధరకు అమ్ముతున్నారా లేదా అని ప్రయాణికులను అడిగి తెలుసుకున్నారు. అలాగే మరుగుదొడ్ల శుభ్రత, యూజర్ చార్జీ వసూళ్లను పరిశీలించారు. డిపో మేనేజర్ పి.దినేష్ కుమార్, స్టేషన్ మేనేజర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

ఆర్థికసాయం



నగదు అందజేస్తున్న సీఐ, నాయకులు

ఖమ్మం అర్బన్: రోడ్డు ప్రమాదంలో గాయపడి పనికి దూరమైన బైక్ మెకానిక్ బోజడ్ల నాగేశ్వరరావుకు మెకానిక్ యూనియన్ బాధ్యులు రూ.10వేల ఆర్థికసాయం అందజేశారు. ఈ నగదును ఖమ్మం ట్రాఫిక్ సీఐ బెల్లం సత్యనారాయణ చేతుల మీదుగా గురువారం అందించారు. యూనియన్ జిల్లా అధ్యక్షుడు వంగాల కొండలరావుతో పాటు షేక్ హమీద్, తట్టు కోనూరి బ్రహ్మచారి, గడ్డం లాలయ్య, తూము సత్యం, ఎర్రోజు నరేష్, షాందు, ఉపేందర్, మహంకాళి చారి, సతీష్, నరేష్ పాల్గొన్నారు.

23న కౌన్సిల్ సమావేశం

ఖమ్మంమయూరిసెంటర్: కేఎంసీ కౌన్సిల్ సమావేశం ఈనెల 23న నిర్వహించేందుకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ మేరకు సమావేశానికి సంబంధించిన అజెండాను రూపొందించాలని మేయర్ పునుకొల్లు నీరజ అధికారులను ఆదేశించారు. దీంతో కౌన్సిల్ అజెండాను తయారు చేసేందుకు విభాగాల వారీగా సంబంధిత అంశాలకు సంబంధించిన సమాచారం ఇవ్వాలని అధికారులను సంబంధిత అధికారులు కోరినట్లు తెలిసింది.

ఔట్ సోర్సింగ్ కార్మికులుగా గుర్తించాలి

ఖమ్మంమయూరిసెంటర్: కేఎంసీ పనిచేస్తున్న పంపు ఆపరేటర్లను ఔట్ సోర్సింగ్ కార్మికులుగా గుర్తించాలని, ఈ నెల 23న జరగనున్న కౌన్సిల్ సమావేశంలో ఈ అంశాన్ని అజెండాగా పెట్టాలని ఏఐటీయూసీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, ఖమ్మం కార్పొరేటర్ బీజీ క్లెమెంట్ కమిషనర్ అభిషేక్ అగస్త్యకు గురువారం వినతిపత్రం అందజేశారు. ఔట్‌సోర్సింగ్ కార్మికులుగా గుర్తించేందుకు గతంలో హామీ ఇచ్చారని, దానిని అమలు చేయాలని కోరారు.

సమస్యల పరిష్కారానికి ఉద్యమం

నేలకొండపల్లి: విద్యారంగ సమస్యల పరిష్కారానికి ఉద్యమించాలని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు పి.సుధాకర్ పిలుపునిచ్చారు. మండల కేంద్రంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. పెండింగ్ ఉపకార వేతనాలు వెంటనే విడుదల చేయాలన్నారు. అనంతరం జూనియర్, డిగ్రీ కాలేజీ నూతన కమిటీలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. వరుణ్‌కుమార్, చాపల వెంకటేష్, సాయి, కొమ్ము, మహేష్, ప్రవీణ్, అరవింద్, నవీన్ పాల్గొన్నారు.

ఆర్థికాభివృద్ధి సాధించాలి

నేలకొండపల్లి: మహిళలు ఆర్థికాభివృద్ధి సాధించాలని ఎంపీడీఓ యం.యర్రయ్య సూచించారు. కూసుమంచిలో జరిగే మహిళా శక్తి సంబురాలకు మండలం నుంచి తరలివెళ్తున్న మహిళల ర్యాలీని ఆయన ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మండల పంచాయతీ అధికారి సిహెచ్.శివ, ఐకేపీ ఏపీవో రాయల శ్రీనివాసరావు, ఈజీఎస్ ఏపీవో ఆర్.సునీత, ఐకేపీ సీసీలు పెద్దపాక వెంకటేశ్వరరావు, మదర్ థెరిస్సా మండల సమాఖ్య అధ్యక్షురాలు కుక్కల సంధ్య, గ్రామ దీపికలు, గ్రామ సమాఖ్య అధ్యక్షురాలు తదితరులు పాల్గొన్నారు.

గోశాలకు పశుగ్రాసం

ఖమ్మంఅర్బన్: నగరంలోని 14వ డివిజన్‌లో ఉన్న ఓం శ్రీ కృష్ణ గోశాలకు దాతలు పెద్ద ఎత్తున పశుగ్రాస దానాలు అందిస్తున్నారు. ఈ మేరకు గురువారం పశుగ్రాసం ఖర్చుగా ప్రసాద్ కుటుంబ సభ్యులు రూ.12,116, కేశ హనుమంతరావు కుమార్తె హర్షిత రూ.6,100 ను విరాళంగా అందజేశారు. ఈ సందర్భంగా గోశాల బాధ్యుడు హనుమంతరావు మాట్లాడుతూ పశువుల సంరక్షణకు దాతలు అందిస్తున్న సాయం అభినందనీయమన్నారు.

ఇళ్ల పట్టాల పంపిణీ

రఘునాథపాలెం: మండలంలోని రేగులచలక పంచాయతీ కార్యాలయంలో గురువారం ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు పట్టాలను అందజేశారు. పంచాయతీ కార్యదర్శి ఆదాం, మాజీ సర్పంచ్ యండపల్లి సత్యం, ఇందిరమ్మ కమిటీ సభ్యులు, సత్యం, జగన్మోహన్ రావు, అనం భూషయ్య, వెంకటేశ్వర్లు ఉన్నారు.

పారిశుద్ధ్యంపై ప్రత్యేక దృష్టి..



- కుక్కల నియంత్రణకు శస్త్రచికిత్సలు..
- వారంలో ఒకరోజు ఖాళీ స్థలాలు శుభ్రం చేయించేందుకు చర్యలు

'సాక్షి' ఫోన్ ఇన్‌లో కేఎంసీ కమిషనర్ అభిషేక్ అగస్త్య

సాక్షి ఫోన్ ఇన్

ఖమ్మంమయూరిసెంటర్: నగరంలో పారిశుద్ధ్య సమస్య పరిష్కారానికి ప్రత్యేక దృష్టి సారిస్తున్నామని, గ్యాంగ్‌వర్కర్లతోపాటు అవసరమైన చోట ప్రత్యేక డ్రైవ్ నిర్వహిస్తామని, ఖాళీ స్థలాలను శుభ్రం చేయించేందుకు వారంలో ఒక రోజును కేటాయించి శుభ్రం చేయిస్తామని, స్థల యజమానులకు జరిమానా విధిస్తామని, కుక్కల సమస్యపై పటిష్ట చర్యలు తీసుకుంటున్నామని, త్వరలోనే ఈ సమస్యకు ఒక పరిష్కారం వస్తుందని, అవసరమైన ప్రాంతాల్లో రోడ్లు, డ్రైయినేజీల నిర్మాణాలకు ప్రతిపాదనలు చేసి కౌన్సిల్ అనుమతి తీసుకుంటామని కేఎంసీ కమిషనర్ అభిషేక్ అగస్త్య తెలిపారు. గురువారం ×సాక్షి₹ ఆధ్వర్యంలో నిర్వహించిన ఫోన్‌ఇన్ కార్యక్రమానికి నగరంలో నెలకొన్న పలు సమస్యలపై నగరవాసులు ఫోన్ చేసి కమిషనర్‌కు ఫిర్యాదు చేశారు. ప్రజలు చేసిన ఫిర్యాదులు, అందుకు కమిషనర్ ఇచ్చిన సమాధానాలు ఇలా ఉన్నాయి..

☛ : ప్రశ్న, అడిగిన వారి పేరు, ఏరియా
● : కమిషనర్ జవాబు

☛ సీసీ రోడ్డు లేకపోవడంతో వర్షం వచ్చినప్పుడు ఇబ్బందిగా ఉంటుంది. బురదతో రోడ్డుపై నడవలేకపోతున్నాం. **– వెంకటేశ్వరరావు, శ్రీరామ్‌నగర్.**

● స్థానికులంతా కలిసి రోడ్డు నిర్మించాలని కోరుతూ ఓ లేఖను కార్పొరేటర్ ద్వారా కేఎంసీ కార్యాలయంలో అందించండి. త్వరలో జరగబోయే కౌన్సిల్‌లో ఈ లేఖను పెట్టి రోడ్డు నిర్మాణానికి ప్రతిపాదనలు చేయిస్తాం.

☛ రోడ్డుపైకి ర్యాంపులు నిర్మిస్తున్నారు. వాహనాలు వెళ్లాలంటే ఇబ్బందిగా ఉంది. **– దనాల వెంకటక్రిష్ణ, శ్రీనివాసనగర్**

● రోడ్డుపైకి ర్యాంపులు నిర్మించకుండా స్థానికులు ముందుగానే అడ్డుకోవాలి. ఎవరైనా అలాగే నిర్మిస్తే కేఎంసీ అధికారులు వాటిని తొలగిస్తారు. ప్రజలు కూడా స్వచ్ఛందంగా బాధ్యత తీసుకొని అభివృద్ధికి సహకరించాలి.

☛ డ్రైయినేజీని శుభ్రం చేయడం లేదు. నీరు బయటకు పోయే పరిస్థితి లేక ఇళ్ల ముందే ఆగుతున్నాయి. **జావేది/షకినా, 22వ డివిజన్**

● సమస్యను రెండు రోజుల్లో పరిష్కరిస్తాం. నిల్వ నీటిని వెంటనే తొలగించేందుకు సిబ్బందికి సూచనలు చేశాం.

☛ రెండు మూడు నెలల నుండి మిషన్ భగీరథ నీరు రావడం లేదు. ఎవరికి చెప్పినా పట్టించుకోవడం లేదు. **– ఎండి.ఫయాజ్, పాండురంగాపురం**

● తాగునీరు రాకపోతే వెంటనే స్థానిక కార్పొరేటర్, సిబ్బంది దృష్టికి తీసుకురండి. వారు పట్టించుకోకపోతే కేఎంసీ కార్యాలయంలో ఫిర్యాదు చేయండి. చర్యలు తీసుకుంటాం.

☛ డ్రైయినేజీ లేక ఇబ్బందులు పడుతున్నాం. వినతులు ఇచ్చినా పట్టించుకోవడం లేదు. నిధులు మంజూరైనా నిర్మించడం లేదు. **– ఫణి రాజ్‌కుమార్/ 51వ డివిజన్ వాసులు**

● డ్రైయినేజీలు, రోడ్లు అవసరం ఉన్న స్థానికులు కార్పొరేటర్ ద్వారా సిఫార్సులు చేస్తే వెంటనే కౌన్సిల్ దృష్టికి తీసుకెళ్లి పనులకు ప్రతిపాదనలు చేయిస్తాం. టీజీఎన్జీవోస్ కాలనీకి ఇంజనీరింగ్ అధికారులు వచ్చి పరిశీలిస్తారు.

☛ గ్యాంగ్ వర్కర్లు పనిముట్లు లేకుండా పనులకు వస్తున్నారు. **– గోళ్ల వెంకటేశ్వరరావు, 25వ డివిజన్**

● శానిటేషన్ అధికారులకు సూచనలు చేశాం. గ్యాంగ్‌వర్కర్లకు అవసరమైన సామగ్రి అందించి పనులు చేసేలా చర్యలు చేపట్టాం.

☛ పందుల బెడద ఎక్కువ అయింది. ఖాళీ స్థలాల్లో మొక్కలు మొలచి సమస్యగా ఉంది. **– పగడాల మోహన్‌రావు 17వ డివిజన్/ శ్రీనివాసనగర్ వాసులు**

● శానిటేషన్ సిబ్బందిని పంపించి పందుల సమస్యను పరిష్కరించేలా చర్యలు తీసుకుంటాం. ఖాళీ స్థలాలను శుభ్రం చేయిస్తాం. అసిస్టెంట్ కమిషనర్‌ను అక్కడకి పంపించి సమస్యను పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటాం.

☛ విద్యుత్ తీగలు ఇళ్లకు తాకుతున్నాయి. ప్రమాదకరంగా ఉందని చెప్పినా ఎవరు పట్టించుకోవడం లేదు. **– నాయిబ్రాహ్మణ కాలనీ వాసులు**

● సమస్యను వెంటనే పరిష్కరిస్తాం. ఇంజనీరింగ్ అధికారులు వచ్చి సంబంధిత సిబ్బందితో తీగలను తొలగించేందుకు చర్యలు తీసుకుంటారు. మీ ప్రాంతానికి వచ్చి మా అధికారులు కాల్ చేస్తారు.

☛ స్పీడ్ బ్రేకర్‌లు చాలా ఎత్తుగా నిర్మించడంతో ప్రమాదాలు జరుగుతున్నాయి. **– ముస్తఫానగర్, విజ్ఞాన్ స్కూల్ వద్ద వాసులు**

● మా ఇంజనీరింగ్ అధికారులు వచ్చి వాటిని పరిశీలించి తొలగిస్తారు.

☛ ప్రజాపాలనలో దరఖాస్తు చేసుకున్నా.. జీరో బిల్లు రావడం లేదు. **– 35వ డివిజన్ వాసి**

● ప్రభుత్వం నుండి కొత్త దరఖాస్తులపై ఎలాంటి సూచనలు రాలేదు. మీ దరఖాస్తులను పరిశీలన చేస్తాం.

☛ సెయింట్ మేరీస్ స్కూల్ వద్ద వాహనాలు వేగంగా వస్తున్నాయి. స్పీడ్ బ్రేకర్‌ను ఏర్పాటు చేయండి. **– ముస్తఫానగర్ వాసులు**

● ఇంజనీరింగ్ అధికారులను పంపించి పరిశీలన చేయిస్తాం.

☛ గోళ్లపాడు చానల్‌పై స్థలం అన్యాక్రాంతం అయ్యే ప్రమాదం ఉంది. ఫెన్సింగ్ ఏర్పాటు చేయండి. **– కృష్ణ, 46వ డివిజన్‌వాసి**

● ఫెన్సింగ్ ఏర్పాటు చేసేందుకు అధికారులకు సూచనలు చేస్తాం. ప్రభుత్వ స్థలాలను ఆక్రమించకుండా చర్యలు తీసుకుంటున్నాం.

☛ మ్యుటేషన్ కోసం కేఎంసీ చుట్టూ తిరుగుతున్నా. **– బానోతు లక్ష్మి, వ్యవసాయ మార్కెట్ ప్రాంతం**

● రెండు రోజుల్లో మీ సమస్యను పరిష్కరిస్తాం.

☛ నగరంలో ఫాగింగ్ చేయడం లేదు. రోడ్ల వెంట న్యూడిల్స్ షాపుల ఎగ్జాస్టర్ ఫ్యాన్లతో వాహనదారుల కళ్లల్లో కారం, మసాలాలు పడుతున్నాయి. వాటర్ సర్వీసింగ్ పాయింట్లతో దారిన పోయే వారిపై నీళ్లు పడుతున్నాయి. **– వల్లాల యుగేందర్, ఖమ్మం వాసి**

● నగరంలో ఫాగింగ్‌ను ప్రారంభించాం. హాట్ స్పాట్ ప్రాంతాల్లో నిరంతరం ఫాగింగ్ జరుగుతోంది. న్యూడిల్స్ పాయింట్‌లు, వాటర్ సర్వీసింగ్ పాయింట్ల సమస్యను పరిష్కరించేందుకు చర్యలు చేపడతాం.

☛ ఎల్ఆర్ఎస్‌కు దరఖాస్తు చేసుకున్నా. అధికారులు పట్టించుకోవడం లేదు. **– అనూష, ఖానాపురం హవేలి**

● అధికారులు మీకు కాల్ చేస్తారు. మీ దరఖాస్తు నంబర్ చెప్పిన వెంటనే సమస్యను పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటారు.

☛ 15 రోజుల నుంచి చెత్తబండి రాకపోవడంతో ఇళ్ల పక్కనే చెత్తాచెదారం ఉంటోంది. **– రమేష్, శ్రీనివాసనగర్ / అశోక్‌కుమార్, టేకులపల్లి**

● రోజు విడిచి రోజు చెత్తసేకరణ చేసేలా సిబ్బందికి సూచనలు చేశాం. చెత్త వాహనాలు రాని ప్రాంతాలను పరిశీలించేలా శానిటేషన్ అధికారులను ఆదేశించాం.

☛ రైల్వే ట్రాక్ పక్కన రోడ్డు నిర్మించండి. **– వెంకటేశ్వర్లు, మామిళ్లగూడెం**

● ఇంజనీరింగ్ అధికారులు వచ్చి పరిశీలన చేసి రోడ్డు వేసేందుకు ప్రతిపాదనలు చేస్తారు.

☛ కుక్కల బెడద పెరిగింది సమస్యను పరిష్కరించండి. **– విజయభాస్కర్‌రెడ్డి, 36, 46వ డివిజన్లు/ శ్రీనివాసనగర్ వాసులు**

● కుక్కల నియంత్రణకు యానిమల్ బర్త్ కంట్రోల్ యూనిట్‌ను పకడ్బందీగా నిర్వహిస్తున్నాం. కుక్కలు ఎక్కువగా ఉన్న ప్రాంతాలను గుర్తించి అక్కడి సమస్య పరిష్కారానికి ప్రత్యేక చర్యలు తీసుకుంటాం.

☛ డ్రైయినేజీలు లేక ఇంటి ముందే నీరాగుతోంది. **– చెరుకూరి హనుమంతరావు, రామచంద్రయ్య నగర్ / ఎం.రవితేజ, ప్రశాంతినగర్ / భారతీ రాణి, 5వ డివిజన్ / నాగేందర్‌రావు, బల్లేపల్లి**

● డ్రైయినేజీలు నిర్మించేందుకు ప్రతిపాదనలు చేస్తున్నాం. ఇక ప్రతీరోజు డ్రైయినేజీలను శుభ్రం చేసేలా సిబ్బందికి సూచనలు చేస్తూ శానిటేషన్ అధికారులకు ఆదేశాలు ఇస్తున్నాం.

☛ భవన నిర్మాణం కోసం చెట్లను కొట్టారు. ఆ చెట్లు స్తంభాలపై పడి విరిగాయి. కాల్వలను పూడ్చారు. **– రామకృష్ణ, సుభాష్‌చంద్రబోస్ విగ్రహ ప్రాంతం**

● టౌన్ ప్లానింగ్ అధికారులు వచ్చి పరిశీలిస్తారు. వెంటనే పూడ్చిన కాల్వలను తీయిస్తాం.

☛ అంబేడ్కర్ గురుకుల కళాశాల ముందు డబ్బా కొట్టుతో ఇబ్బందిగా ఉంది. ఇక్కడ సిగరెట్లు తాగుతున్నారు. దీనిని తొలగించండి. **– మంగలి కాలనీ వాసి.**

● మా డీఆర్ఎఫ్ టీమ్ వచ్చి పరిశీలించి. డబ్బాను తొలగిస్తారు. ఎవరైనా ఇబ్బంది కలిగిస్తే స్థానికులు వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేయండి.

☛ నీళ్లు వృథాగా పోతున్నాయి. ఎవరికి చెప్పినా పట్టించుకోవడం లేదు. **– మహేష్, 13వ డివిజన్**

● ఇంజనీరింగ్ అధికారులను పంపించి సమస్యను పరిష్కరించి ఈ సమస్యను అరికడతాం.



ఫోన్ ఇన్‌లో అధికారులతో కలిసి మాట్లాడుతున్న కేఎంసీ కమిషనర్ అభిషేక్ అగస్త్య

యజమానులకు నోటీసులు

సాక్షి ఎఫెక్ట్..

ఖమ్మంమయూరిసెంటర్: నగరంలోని ఖాళీ స్థలాలను శుభ్రం చేయించేలా యజమానులకు నోటీసులు ఇవ్వడంతో పాటు వారు స్పందించకపోతే కేఎంసీ తరుపున శుభ్రం చేయించి యజమానులకు జరిమానా విధించాలని అసిస్టెంట్ కమిషనర్ అనిల్‌కుమార్ సూచించారు. 'సాక్షి' ఆధ్వర్యాన నిర్వహించిన ఫోన్ ఇన్‌లో పలువురు కోతులు, కుక్కలు, పందుల బెడదతో పాటు ఖాళీ స్థలాల సమస్యలను వివరించారు. దీంతో కమిషనర్ సూచనలతో సాయంత్రం జవాన్లతో సమావేశమైన అసిస్టెంట్ కమిషనర్ సమస్యలపై ఆరా తీశారు. కోతులను పట్టించి అటవీ ప్రాంతాలకు తరలించే బాధ్యత జవాన్లు తీసుకోవాలని, ఇళ్ల మధ్య పందుల పెంపకందారులను శివార్లకు తరలించేలా చూడాలని సూచించారు. అలాగే, కుక్కలకు శస్త్రచికిత్స చేయించేలా ఏబీసీ సెంటర్ బాధ్యులకు సమాచారం ఇవ్వాలన్నారు. శానిటరీ సూపర్‌వైజర్ ఎం.సాంబయ్య పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన అవసరం

ఖమ్మంలీగల్: విద్యార్థులు చట్టాలపై అవగాహన పెంచుకోవాలని న్యాయసేవాధికార సంస్థ జిల్లా కార్యదర్శి కేవీ.చంద్రశేఖర్‌రావు సూచించారు. ఖమ్మంలోని తెలంగాణ సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ పాఠశాల, జూనియర్ కళాశాలలో గురువారం ఏర్పాటుచేసిన అవగాహన సదస్సులో మాట్లాడారు. బాలికలు సమాజంలో జరుగుతున్న అకృత్యాలపై అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. అలాగే, బాధితులకు అవసరమైన న్యాయసాయం ఉచితంగా అందుతుందనే అంశాన్ని తెలియజేయాలన్నారు. ప్రిన్సిపాల్ విజయదుర్గ, పారాలీగల్ వలంటీర్లు నాగమణి, కోమలత పాల్గొన్నారు.

హోంగార్డు కుటుంబానికి రూ.38 లక్షల బీమా చెక్కు



చెక్కు అందజేస్తున్న సీపీ సునీల్‌దత్

ఖమ్మంక్రైం: ఇటీవల మృతి చెందిన ఖమ్మం యూనిట్ హోంగార్డు గంటా నరేష్‌కుమార్‌కు యాక్సెస్ బ్యాంక్‌లో సాలరీ అకౌంట్ ఉండడంతో రూ.38 లక్షల ప్రమాద బీమా పరిహారం మంజూరైంది. ఈమేరకు చెక్కును ఆయన భార్య నాగరాణికి సీపీ సునీల్ దత్ గురువారం అందజేశారు. ఏఆర్ ఏసీపీ సుశీల్‌సింగ్, ఆర్ఐ సురేష్, హోంగార్డ్ వెల్ఫేర్ అసోసియేషన్ బాధ్యులు బంక శ్రీను, వెంకటేశ్వర్లు, రవిబాబు, నాగరాజు పాల్గొన్నారు.

ఉద్యమకారులకు ఇచ్చిన హామీలు నెరవేర్చాలి



నిరసన తెలుపుతున్న కమిటీ

ఖమ్మం మామిళ్లగూడెం: తెలంగాణ ఉద్యకారులకు రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన హామీలను వెంటనే నెరవేర్చాలని తెలంగాణ ఉద్యమకారుల జాయింట్ యాక్షన్ కమిటీ డిమాండ్ చేసింది. ఈ మేరకు గురువారం ఖమ్మం మయూరిసెంటర్ అమరవీరుల స్థూపం నుంచి జెడ్పీ సెంటర్ వరకు ప్లకార్డులతో భారీ ప్రదర్శన నిర్వహించి అనంతరం అంబేడ్కర్ విగ్రహానికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బత్తుల సోమయ్య మాట్లాడుతూ... రాష్ట్రం సాధన ఉద్యమంలో శారీరకంగా, వృత్తి రీత్యా ఆర్థికపరంగా అన్ని రకాలుగా నష్టపోయారన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం మోసం చేసిందని, కాంగ్రెస్ ప్రభుత్వమైనా ఉద్యమకారులకు, అమరవీరుల కుటుంబాలకు ఇచ్చిన హామీలు నెరవేర్చుతుందని కొండంత ఆశతో ఎదురుచూస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అంబల రామారావు, జిల్లా అధ్యక్షుడు పాలకుర్తి కృష్ణ, భిక్షం, ఫక్రుద్దీన్, చారి, వెంకన్న, రాజేష్ నాయక్, వెంకటేశ్వర్లు, రమా, అరుణ, అంజయ్య, పాపయ్య, వీరబాబు, మాంగ్యలాల్, శాంతమ్మ, గురవయ్య, ముత్తయ్య, ప్రసాద్, వెంకట్, రాము, శ్రీను, రామాంజనేయులు, శ్యామ్, ఉపేందర్, నాగేశ్వరరావు, మేరీ, నాగయ్య తదితరులు పాల్గొన్నారు.

పాలకుల వైఖరిని యువత ఎండగట్టాలి



మాట్లాడుతున్న ధర్మేంద్ర

ఖమ్మంరూరల్: ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తూ పెత్తందారుల చేతిలో ప్రభుత్వాలను కీలుబొమ్మలుగా మార్చిన పాలకుల వైఖరిని ప్రజాక్షేత్రంలో యువత ఎండగట్టాలని ఏఐవైఎఫ్ రాష్ట్ర కార్యదర్శి కె.ధర్మేంద్ర అన్నారు. ఏదులాపురం మున్సిపాలిటీ పరిధిలోని ముత్తగూడెంలో జరిగిన ఏఐవైఎఫ్ 13వ మండల మహాసభలో ఆయన మాట్లాడుతూ.. 18 ఏళ్లు నిండిన యువతకు ఓటు హక్కు, హక్కులు ఏఐఎస్ఎఫ్ చేసిన పోరాట ఫలితంగానే లభించిందన్నారు. పాలకుల విధానాలపై యువత గలమెత్తాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. సీపీఐ రాష్ట్ర కంట్రోల్ కమిషన్ చైర్మన్ ఎండీ.మౌలానా, నాయకులు దండి సురేష్, ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షుడు మహ్మద్ గౌస్‌పాషా, కార్యదర్శి రామకృష్ణ, రవి, మిడకంటి చినవెంకటరెడ్డి, చెరుకుపల్లి భాస్కర్, శ్రీనాథ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బకాయిలు చెల్లించాలి



ఆందోళన చేస్తున్న నాయకులు

తిరుమలాయపాలెం: స్కాలర్‌షిప్, ఫీజు రియింబర్స్‌మెంటు బకాయిలు చెల్లించాలని డిమాండ్ చేస్తూ మండలంలోని పిండిప్రోలు కళాశాలలో పీడీఎస్‌యూ ఆధ్వర్యంలో విద్యార్థులు గురువారం భారీ ర్యాలీ నిర్వహించి రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి గోకినపల్లి మస్తాన్ మాట్లాడుతూ... ప్రభుత్వం పేద విద్యార్థులను చదువులకు దూరం చేసే విధంగా వ్యవహరిస్తుందన్నారు. నాలుగేళ్లగా ఫీజు రియంబర్స్‌మెంట్, ఉపకార వేతనాలు ఇవ్వడం లేదని విద్యార్థులు చదువులు ఎలా కొనసాగించాలన్నారు. ఈ విద్యా సంవత్సరం నష్టపోకుండా చూడాల్సిన బాధ్యత రాష్ట్ర ప్రభుత్వంపైన ఉందన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు అజయ్, శ్రీకాంత్, వంశీ, నాగేష్ ఉన్నారు.

వైభవంగా 'తీజ్'



తీజ్ బుట్టలతో ఊరేగింపుగా వస్తున్న మహిళలు

నేలకొండపల్లి: మండలంలోని మంగాపురంతండాలో గురువారం తీజ్ వేడుకలు అంగరంగ వైభవంగా జరిగాయి. ఈ సందర్భంగా తొమ్మిది రోజుల పాటు పూజలు చేసిన గోధుమ బుట్టలను డప్పు వాయిద్యాల నడుమ ఆటపాటలతో ఊరేగించి నిమజ్జనం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రాజారాంపేట సొసైటీ చైర్మన్ బాలాజీ, భూక్యా సుధాకర్, ధీరావత్ రాధాకృష్ణమూర్తి, తేజావత్ గిరి, మల్లిఖార్జున్, రామచంద్, కోటేశ్వరరావు, గోబ్రియా, శంకర్, తేజ, శ్రీను పాల్గొన్నారు.

అన్నదానం



భోజనం వడ్డిస్తున్న సయ్యద్ బాషా

ఖమ్మం మామిళ్లగూడెం: నూర్‌బాషా, దూదేకుల, ముస్లిం మైనార్టీ సంక్షేమ సంఘం రాష్ట్ర మాజీ అధ్యక్షుడు షేక్ గాలిబ్ వర్ధంతి సందర్భంగా గురువారం ఖమ్మం వృద్ధ అనాథాశ్రమంలో అన్నదానం చేశారు. రాష్ట్ర అధ్యక్షుడు షేక్ సయ్యద్ బాషా, ప్రధాన కార్యదర్శి రహీం, రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు జానీ బేగం, మహిళా ఉపాధ్యక్షురాలు సకినాబీ, జిల్లా అధ్యక్షుడు రహీంపాషా, రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ సొందులాలు, జిల్లా ప్రధాన కార్యదర్శి సిద్దుపాషా, నగర అధ్యక్షుడు రసూల్, ప్రధాన కార్యదర్శి సైదా హుస్సేన్, సైదులు, భద్రాద్రి ప్రధాన కార్యదర్శి ఖాసిం, ఫరీదు, సాయిబు హుస్సేన్, దుర్గాబాషా, మౌలానా, ఖాదర్, మస్తాన్, మీరా ఉన్నారు.

గ్రంథాలయాల సంస్థ చైర్మన్‌కు అభినందనలు

ఖమ్మం మామిళ్లగూడెం: భద్రాద్రి కొత్తగూడెం జిల్లా గ్రంథాలయాల అభివృద్ధి సంస్థ చైర్మన్‌గా నియమితులైన పసుపులేటి వీరబాబును ఈ సందర్భంగా మున్నూరుకాపు సంఘం నాయకులు గురువారం కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు. నాయకులు శెట్టి రంగారావు, రవికుమార్, కొత్తా సీతారాములు, పసుపులేటి దేవేందర్, మంజుల, కట్ల రంగారావు, హనుమంతరావు, కనిసెట్టి నర్సయ్య, కల్లూరి సోమనాథం, రాపర్తి శరత్, పూర్ణచందర్‌రావు, పూర్ణ, శ్రీనివాసరావు, శ్రీను, నరసింహారావు, వెంకటేశ్వరరావు, జయప్రకాష్ ఉన్నారు.

రుణాలు పంపిణీ

ఖమ్మం మామిళ్లగూడెం: ఖమ్మం టీజీజీవీబీ ఇల్లెందు ఎక్స్‌రోడ్ బ్రాంచ్ ద్వారా బాలాజీ డిజేబులిటీ గ్రూప్ సభ్యులకు వడ్డీ లేని రుణాలు మంజూరయ్యాయి. ఈ సందర్భంగా గురువారం మున్సిపల్ కమిషనర్ చేతుల మీదుగా లబ్ధిదారులకు రుణాలు అందజేశారు. బాలాజీ గ్రూప్ సభ్యులు సుజాత, సల్మా పాల్గొన్నారు.

అర్బన్ ఆర్ఐగా జయకృష్ణ

ఖమ్మంఅర్బన్: ఖమ్మం అర్బన్ తహసీల్దార్ కార్యాలయ ఆర్ఐగా జయకృష్ణను నియమించారు. ఇప్పటి వరకు ఆర్ఐగా ఉన్న సాయిన రేష్ కలెక్టరేట్‌కు బదిలీ చేయగా ఆయన స్థానంలో చింతకాని ఆర్ఐగా ఉన్న జయకృష్ణను కేటాయించారు.

సంక్షిప్తంగా..

పాలిటెక్నిక్ ఫీజులను పెంచొద్దు

ఖమ్మం మామిళ్లగూడెం: పాలిటెక్నిక్ ఫీజులను పెంచవద్దని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి టి.ప్రవీణ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం ఖమ్మం సుందరయ్య భవనంలో ఎస్ఎఫ్ఐ ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ... కౌన్సెలింగ్ వాయిదా వేశామని చెప్పిన ప్రభుత్వం ఫీజులను పెంచే సీట్ల అలాట్మెంట్ చేయడం సిగ్గుచేటన్నారు. ప్రభుత్వం ఒక్కసారిగా 14,900 నుండి 39,100 రూపాయల వరకు ఫీజులను పెంచి విద్యార్థులపై భారం మోపడం దుర్మార్గపు చర్య అన్నారు. జిల్లా ఉపాధ్యక్షుడు రాజు, నాయకులు త్రినాథ్, లోకేష్, మనోజ్, సతీష్, మహేష్ పాల్గొన్నారు.

నగరంలో గాలి దుమారంతో వర్షం




చెట్టును తొలగిస్తున్న డీఆర్ఎఫ్ సిబ్బంది

ఖమ్మంమయూరిసెంటర్: నగరంలో గురువారం రాత్రి గాలిదుమారంతో వర్షం కురిసింది. భారీగా ఈదురు గాలులు రావడంతో పలు ప్రాంతాల్లో చెట్లు నెలకొరిగాయి. దీంతో కేఎంసీ డీఆర్ఎఫ్ సిబ్బంది రోడ్డుపై పడిన చెట్లను తొలగించారు. చెట్లు కూలడంతో వాహనదారులకు కొంత ఇబ్బంది కలిగింది.

స్థానిక ఎన్నికల్లో పోటీ

కూసుమంచి: రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో పాలేరు నియోజకవర్గంలో అన్ని స్థానాల్లో తమ పార్టీ పోటీ చేస్తుందని సీపీఎం పాలేరు డివిజన్ కార్యదర్శి బండి రమేష్ అన్నారు. ఈ మేరకు గురువారం కూసుమంచిలో పార్టీ కార్యాలయంలో నిర్వహించిన మండల కమిటీ సమావేశంలో వారు మాట్లాడారు. పార్టీ మండల కార్యదర్శి తోటకూరి రాజశేఖర్, నాయకులు బిక్కసాని గంగాధర్, ఎడవెల్లి రమణారెడ్డి, శీలం గురుమూర్తి పాల్గొన్నారు.

సాగులో మెళకువలతో అధిక దిగుబడి



కూలీలతోపాటు పొలంలోకి దిగిన శిరీష

నేలకొండపల్లి: వరిసాగు చేసే రైతులు నారు మొదలు మెళకువలు పాటిస్తే అధిక దిగుబడి సాధిచొచ్చని ఏఈఓ) బి.శిరీష తెలిపారు. మండలంలోని కట్టుకాచారంలో గురువారం పర్యటించిన ఆమె వ్యవసాయ కూలీలతో కలిసి వరి నాట్లు వేశారు. ఈ సందర్భంగా నాట్లు వేయడంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. అలాగే, విచక్షణారహితంగా పురుగుల మందులు వాడొద్దని తెలిపారు. వెదజల్లే, డ్రమ్ సీడర్ పద్ధతులు వినియోగిస్తే ఫలితం ఉంటుందన్నారు.

సీజీఎస్టీ అవగాహన సదస్సు



భిక్షపతిని సత్కరిస్తున్న చాంబర్ ప్రతినిధులు

ఖమ్మంగాంధీచౌక్: కేంద్ర వస్తు సేవా పన్ను(సీజీఎస్టీ)పై గురువారం ఖమ్మం చాంబర్ ఆఫ్ కామర్స్ సమావేశ మందిరంలో శాఖ అధికారులు వ్యాపారులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. సీజీఎస్టీలో వచ్చిన మార్పులపై జీఎస్టీ అసిస్టెంట్ కమిషనర్ భూక్యా భిక్షపతి, సూపరింటెండెంట్ జాన్ నూతన్ కుమార్ వివరించారు. ఈ సందర్భంగా జీఎస్టీ అసిస్టెంట్ కమిషనర్ భిక్షపతిని చాంబర్ ప్రతినిధులు సత్కరించారు. చాంబర్ ఆఫ్ కామర్స్ గౌరవాధ్యక్షుడు మేళ్లచెర్వు వెంకటేశ్వరరావు, అధ్యక్షుడు చిన్ని కృష్ణారావు, ప్రధాన కార్యదర్శి మెంతుల శ్రీశైలం, ఉపాధ్యక్షులు సోమా నరేష్ , సహాయ కార్యదర్శి మన్నెం కృష్ణ, వేణుగోపాల్‌రావు, నాగేశ్వరరావు, నేరెళ్ల శేషగిరిరావు, శ్రీనివాసరావు, దిగుమతి శాఖ కార్యదర్శి ముత్యం ఉప్పల్‌రావు, మిర్చి కార్యదర్శి యర్లపల్లి సతీష్‌కుమార్ ఉన్నారు.

ప్రభుత్వ పాఠశాలల బలోపేతమే లక్ష్యం



సభ్యత్వం అందజేస్తున్న నాయకులు

రఘునాథపాలెం: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యా ప్రమాణాలు మెరుగుపడాలంటే ఉపాధ్యాయులే కీలక పాత్ర పోషించాల్సిన అవసరం ఉందని పీఆర్‌టీయూ రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు రాయల నర్సింహారావు అన్నారు. గురువారం మండలంలో జరిగిన సభ్యత్వ నమోదు నిర్వహించారు. జిల్లా ఉపాధ్యక్షుడు తాళ్లూరి చంద్రశేఖర్, మండల అధ్యక్షుడు గుర్రం కేశవరావు, ప్రధాన కార్యదర్శి తూమాటి సైదుబాబు, సతీష్, ఉపాధ్యక్షులు అజ్మీర సోమ్లా నాయక్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అర్హులకు రేషన్‌కార్డులు జారీ చేయాలి

ఖమ్మంఅర్బన్: ఖమ్మం నియోజకవర్గంలో 40 వేల మంది రేషన్‌కార్డుల కోసం దరఖాస్తు చేసుకుంటే కేవలం నాలుగు వేల మందికే కార్డులు మంజూరు చేయడం బాధాకరమని, అర్హులందరికీ కార్డులు మంజూరు చేయాలని సీపీఎం ఖమ్మం డివిజన్ కార్యదర్శి వై.విక్రమ్ అన్నారు. ఇందిరానగర్ సెంటర్‌లోని ఖానాపురం హవేలీ మండల కార్యాలయంలో సమావేశంలో నిర్వహించారు. పార్టీ మండల కార్యదర్శి దొంగల తిరుపతిరావు, రమ్య ఉన్నారు.

నేడు సాగు న్యాయయాత్ర

కూసుమంచి: మండలంలోని నాయకన్‌గూడెం, పాలేరు, కూసుమంచి గ్రామాల్లో శుక్రవారం సాగు న్యాయయాత్ర కొనసాగుతుందని ఏట వాణి తెలిపారు. భూ సమస్యలపై అవగాహన కల్పిస్తారని తెలిపారు.